# సావిత్రి

మద్రేశ్వరుడయిన అశ్వపతికి, మాళవికి సావిత్రీదేవివరప్రసాదినిగా జన్మించింది ఒక ఆడపిల్ల. రాజదంపతులు ఆ పిల్లను అతిగారాబంగా పెంచారు. ఆడింది ఆట, పాడింది పాటగా పెరిగింది. ఆ పిల్ల- సావిత్రి.

యౌవన ప్రాంగణంలో అడుగుపెట్టిన సావిత్రికి సాళ్వ రాజకుమారుడైన సత్యవంతుని గుణగణాలు వీనులవిందు చేశాయి. ఆమె స్నేహితురాళ్ళు అనుక్షణం ఆ సత్యవంతుని రూపరేఖావిలాసాలు వర్ణిస్తుంటే, అతని ఊహాచిత్రం సావిత్రి మనసులో గాఢంగా చిత్రించుకుంది. అందరి నోట వింటున్న సత్యవంతుని గుణసంపద, ధర్మనిరతి ఆమె మనసు నాకట్టుకున్నాయి. అతని తండ్రి విధి వశాన అంధుడై, రాజ్యం పోగొట్టుకుని అరణ్యంలో జీవిస్తున్నాడని స్నేహితుల వల్ల విన్న సావిత్రి మనసు ఎంతో బాధ చెందింది. అయినా సత్యవంతునిపైనే ప్రేమానురాగాలు పెంచుకుంటూనే ఉంది.

ఆనాడు అశ్వపతి భవనానికి నారదముని ఏతెంచాడు. అతిథి పూజలు చేసి, కుశల సంభాషణలు జరుపుతుంటే, పూదోట నుంచి అప్పుడే వచ్చిన సావిత్రి తండ్రిదగ్గరకొచ్చి నిల్చింది. పుత్తడిబొమ్మలా ఉన్న ఆ పిల్లను చూస్తూ నారదుడు "ఈ అమ్మాయిని తగిన వరునికిచ్చి వివాహం చేయక ఎందుకింకా ఆలస్యం చేస్తున్నావ్?" అని ప్రశ్నించాడు.

"మహామునీ, ఈ పిల్ల దేవతా వరప్రసాదిని. ఆమెకి తగిన వరుని నేను వెతికి తేగలనా? అందుకే అమ్మాయితో మనసుకి నచ్చిన రాజకుమారుని వరించమని చెప్పాను'' అన్నాడు.

సావిత్రి సిగ్గుతో తల వంచుకుంది. ఆమె చెక్కిళ్ళు ఎర్రబడ్డాయి. కానీ, తను సిగ్గుపడి మనసులో విషయం చెప్పకుండా దాచుకుంటే ఎలా అనుకుంది. ఇంతవరకూ పైకి చెప్పకుండానే ఊరుకుంది తాను. సావిత్రి కొంచెం ధైర్యం తెచ్చుకుంది.

"తండ్రీ! సాళ్వపతి కుమారుడైన సత్యవంతుని నేను వరించాను. అతని రూపగుణాలు విన్న నేను నా మనసు అతనికే అర్పించాను."

అశ్వపతి కనుబొమ్మలు ముడి పడ్డాయి. రాజ్యం పోగొట్టుకుని, అంధుడై అరణ్యంలో ఉంటున్న సాళ్వపతి కుమారుడు సత్యవంతుడు. అతన్నా తన కూతురు వరించింది? పైగా, అతన్ని చూడకుండానే అతన్ని గురించి విని వరిస్తోందా? భోగభాగ్యాలతో తులతూగుతున్న సావిత్రి భర్తతో అరణ్యంలో జీవిస్తూ కష్టాలు పడుతుందా? అశ్వపతి మనసు సావిత్రి నిర్ణయానికి చాలా నొచ్చుకుంది.

ఎదురుగా నారద మహాముని ఉన్నాడు.

"మునీంద్రా, తమ రెరుగని వా రుండరు. ఆ సత్యవంతుడు ఎలాంటి వాడో నాకు తెలియపరచండి. తండ్రిగా వివరాలు తెలుసుకోకుండా పిల్ల నిచ్చి వివాహం ఎలా చేస్తాను?" అన్నాడు అశ్వపతి. ఆందోళన అతని ముఖాన్ని ఆవరించింది.

"అతని పేరు చిత్రాశ్వుడు. ఎప్పుడూ సత్యమే పల్కుతాడు కనక సత్యవంతు డన్నా రంతే. తేజస్సులో సూర్యుని లాటివాడు. బుద్ధిలో బృహస్పతి లాటివాడు. అంతేకాదు. దానం, త్యాగం, తపం, ధ్యానం, పాండిత్యం మొదలైన వన్నీ ఒకేచోట రాశిపోసి నట్లుంటాడు సత్యవంతుడు."

నారదుడు ఈ మాట అంటూ సావిత్రి వంక, అశ్వపతి వంక చూశాడు.

అశ్వపతి ముఖం విప్పారింది. మనసులో ఆవేదన చెదిరిపోయింది.

"ఇంకా ఏమైనా విషయాలు మీకు తెలిసినవి చెప్పండి మహర్షీ!" అన్నాడు ఉత్సాహంగా.

"ఒక్కమాట, శ్రద్ధగా ఆలకించు." నారదుడు గొంతు తగ్గించాడు - "నేటినుంచి ఒక్క సంవత్సర కాలంలో అతని ఆయుస్సు పరిసమాప్త మవుతుంది. నువ్వు నా ఆత్మీయుడవు కనుక చెప్పకుండా దాచకూడదు కనక చెప్తున్నా."

అశ్వపతి నిశ్చేష్టు డయ్యాడు. నోట మాట పెగలలేదు. ఎదురుగా సావిత్రి కనిపిస్తోంది. మనసు కూడదీసుకున్నాడు.

"తల్లీ, మహామునికి దేవరహస్యాలు తెలుస్తాయి. మృత్యు ముఖంలోకి త్వరలో వెళ్ళిపోతాడని తెలిసి తెలిసి ఈ పరిణయం ఎలా చేయగలను? నీ

మనసు మార్చుకో. తగిన వరుని వెతికి వివాహం జరిపిస్తాను." అశ్వపతి గొంతు గద్గదమైంది.

సావిత్రి మౌనం దాల్చింది.

"బంగారంలాటి బ్రతుకు పాడుచేసుకోకు. నీ మనసు మార్చుకో." అశ్వపతి సావిత్రిని బతిమిలాడాడు.

తండ్రి ముఖం చూస్తూ. ఇక మౌనంగా ఉండలేకపోయింది సావిత్రి. ఆమె చూపులో నిశ్చలత నిండింది. మునిమాట ఆమెకూ అశనిపాతమే అయింది. అయినా, ఇంతవరకు తన మనసులో నిలుపుకొన్న వ్యక్తిని, ఆయుర్భాగ్యం తక్కువైందని విని మనసు నుంచి తోసివేయగలదా? అతని స్థానంలో మరొకరిని ఊహించటం కూడా తనకు సాధ్యంకాదు. తన ప్రేమ పవిత్రమైంది. ఏ దేవతో తనపైన దయదలచి అతని ఆయువు పెంచకూడదా- ఏమో! సావిత్రి దృఢనిశ్చయంతో తండ్రి వంక చూసింది.

"త్రికరణశుద్ధిగా ప్రేమించిన సత్యవంతుని నేను మరచిపోలేదు. అతను ఎలాంటివాడైనా అతనే నా భర్త!"

సావిత్రి నిర్ణయానికి మూర్ఛితురాలైంది తల్లి.

ఎడతెగని కన్నీరు ఆపుకోలేక తల వంచుకున్నాడు అశ్వపతి.

"ఆమె పుణ్యవశాన అతని ఆయువు పెరుగుతుందేమో, విధి నిర్ణయాన్ని ఎవరు ఆపగలరు? సావిత్రీ, సత్యవంతుల వివాహం జరిపించండి. మనసుకి ఊరట కలిగించుకోండి." నారదుడు సానునయంగా అశ్వపతితో పలికాడు.

నిస్సహాయంగా అశ్వపతి, భార్య సావిత్రీ సత్యవంతుల వివాహాన్ని జరిపించారు అశ్రువులను ఆపుకుంటూ.

భర్త మరణకాలం సమీపిస్తున్నకొద్దీ వ్రతదీక్షాపరురాలైంది సావిత్రి.

ఆనాడు భర్తతో తనూ అడవికి బయలుదేరింది. మృత్యువు తోసుకొచ్చేస్తుంటే, గొడ్డలి నేలమీద పడేసి, సావిత్రి ఒళ్ళో తల వాల్చాడు సత్యవంతుడు. ఏం జరగబోతూందో సావిత్రికి తెలుసు.

యముడు తానే స్వయంగా వచ్చాడు. భర్త ప్రాణాలు తన వెంట కొనిపోతున్న ధర్మప్రభువు వెంట పరుగెత్తింది సావిత్రి.

"ఒక వ్యక్తి ప్రాణంకోసం నేను బయలుదేరి రాను. కానీ నీ శక్తి తెలిసే వచ్చాను. నీ భర్తపై నీకున్న ప్రేమానురాగాలు వినే నేను వచ్చాను. నీ భర్త ప్రాణం తప్ప నాలుగు వరాలు కోరుకో." వెంట వస్తున్న సావిత్రి నుద్దేశించి అన్నాడు యమధర్మప్రభువు.

సావిత్రి ఆలోచించింది. తన భర్త ప్రాణరహితుడైతే, తను ప్రాణసహిత ఎట్లా అవుతుంది? తన భర్త ప్రాణం ఎక్కడుంటే తనూ అక్కడే ఉంటుంది. అందుకే మొదటి వరం తప్ప తక్కిన మూడూ కోరతాను-అనుకుని ధైర్యంగా నిలబడింది.

సావిత్రి కోరిన మూడు వరాలూ అనుగ్రహించాడు. "మరి నాలుగో వరం కోరుకో."

"ధర్మప్రభూ, నాలుగో వరమే నా మొదటి వరం. అయినా, నువ్వు అది కోరవద్దన్నావుగా. నా భర్త ప్రాణాల వెంట నా ప్రాణాలు ఉంటాయని నీకు తెలుసుగా? అని అభేదం."

సావిత్రి మాటలు వింటుంటే యమధర్మప్రభువు మనసు మారుతోంది. సకల భూత చరాచర ప్రాణప్పందన ఎరిగిన ధర్మ ప్రభువుకి సూక్ష్మ సత్యం ఎదురైంది,

విధి నిర్ణయంవల్ల సత్యవంతుని ప్రాణాలు తను తీసికెళ్ళగలడు కానీ, విధి నిర్ణయంలో లేని సావిత్రి ప్రాణాలు ఎలా తీసికెళ్ళగలడు? ధర్మసూక్ష్మం ఎంత క్లిష్టతరమైందో అర్థమైంది యమధర్మరాజుకి.

"సావిత్రీ! నీ భర్తపైన నీకున్న ప్రేమ, నీ ధర్మనిరతి, నీ దీక్ష నన్ను వశపరచుకున్నాయి. ఇదు చూడు ఒక్కసారి." యమపాశాలను వదులుచేస్తూ అన్నాడు ధర్మప్రభువు.

తన కళ్ళను నమ్మలేకపోతోంది సావిత్రి. రిక్తహస్తంతో యమధర్మ రాజు మరలిపోతుంటే, భక్తితో, ఆనందంతో, సాశ్రునయనాలతో చూస్తూ, చేతులు జోడించింది, భర్త ప్రాణాలు తిరిగి సంపాదించుకున్న ప్రేమమయి సావిత్రి .

(ఆధారం : కవిత్రయంవారి శ్రీమదాంధ్ర మహాభారతం
అరణ్యపర్వం : సప్తమాశ్వాసం)
(ప్రచురణ : ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక : 2-3-1988)